తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## తిరుపతి డిఎంహెచ్ఓగా డాక్టర్ శ్రీహరి కొనసాగింపు

### హైకోర్టు ఉత్తర్వులు జారీ



తిరుపతి టౌన్, జూన్ 28, ప్రభాతవార్త
తిరుపతి డిఎంహెచ్ఓగా డాక్టర్ శ్రీ హరిని కొనసాగిస్తూ హై కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి డిఎంహెచ్ఓగా డాక్టర్ శ్రీహరి స్థానంలో డాక్టర్ ఆర్.ఆర్ రెడ్డి నియామకం పై హైకోర్టు స్టే విధించింది. ఎలాంటి ఫిర్యాదులు గానీ సాధారణ ట్రాన్స్ఫర్స్ నిబంధనలు ప్రకారం గానీ చూపకుండా తన స్థానంలో మరో వ్యక్తి నియామకం పై డాక్టర్ శ్రీ హరి హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పిటిషన్ స్వీకరించిన హైకోర్టు విచారణ జరిపి ఆర్ఆర్ రెడ్డి నియామకం చెల్లదని ఆదేశాలు ఇచ్చింది. దీనితో తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ శ్రీహరినే కొనసాగిస్తూ హైకోర్టు ఆర్డర్‌ను పాస్ చేసింది. డాక్టర్ శ్రీహరి కొనసాగింపు పై జిల్లా ఆరోగ్య శాఖ సిబ్బంది ఆనందం వ్యక్తం చేసారు.

## ఘనంగా కనం గంగమ్మ ఊరేగింపు ఉత్సవాలు

పెద్దపంజాణి జూన్28 ప్రభాతవార్త :



మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని ఆకులవారి పల్లి, బేరుపల్లి,గౌరీనగర్ గ్రామాల్లో కనం గంగమ్మ జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సును డప్పువాయిధ్యాలతో,డిజేసౌండ్స్‌లతో, బాణాసంచా వేడుకల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. బుధవారం మూడు గ్రామాలకు చెందిన భక్తులు కనంలోని అమ్మవారి ఆలయంలో అమ్మవారి శిరస్సును ప్రతిష్టించిన అనంతరం మూడు గ్రామాలప్రజలు అమ్మవారికి పెద్దఎత్తున ప్రత్యేకపూజలు నిర్వహింరు. ఈ కార్యక్రమంలో ఆకులవారిపల్లి, గౌరీనగర్, బేరుపల్లి గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని అమ్మవారికి పూజలు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# పేదవారి తలరాత మార్చే ఆయుధం విద్య

- తల్లిదండ్రులకు విద్య భారం కాకూడదని సిఎం అమ్మఒడి రూపకల్పన
- డిప్యుటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు



అమ్మఒడి కార్యక్రమంలో విద్యార్థులకు తల్లులకు మెగా చెక్కును అందిస్తున్న డిప్యుటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్ తదితరులు.

చిత్తూరు, జూన్ 28 ప్రభాతవార్త:
పేదవారి తలరాత మార్చే ఆయుధం ఒక్క విద్యేనని అలాంటి విద్య తల్లిదండ్రులకు భారం కాకూడదని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారని డిప్యుటీ సిఎం నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్, శాస్త్ర సాంకేతిక, పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు అన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురపాల గ్రామం నుండి 4వ విడత అమ్మఒడి కార్యక్రమంను కంప్యూటర్ బటన్ నొక్కి తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయి కార్యక్రమం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఏర్పాటు చేయగా ఇందులో డిప్యుటీ సిఎం నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలతో పాటు ఎంపీ రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, మేయర్ అముద, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్, రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ మురళీధర్, జడ్పీ మహిళా స్థాయి సంఘ ఛైర్మన్ భారతి, డిఇఓ విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యుటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న అమ్మఒడితో పాటు జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం విద్య కోసం చేస్తున్న ప్రతి కార్యక్రమం 20 సంవత్సరాల అనంతరం నేటి విద్యార్థులు కలెక్టర్లు, ఎస్పీలుగా ఉన్నత స్థానాల్లో స్థిరపడే అవకాశం వుంటుందన్నారు. విద్యార్థులకు ఇంగ్లీషు విద్య బోధించడంతో వారు ప్రపంచ స్థాయిలో పోటీని తట్టుకొని నిలబడే అవకాశం వుంటుందన్నారు. పేద విద్యార్థులు విద్యకు దూరం కాకూడదని, తల్లిదండ్రులకు వారి పిల్లల విద్య భారం కాకూడదనే ఉద్దేశంతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 1 నుండి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు ప్రతి ఏడాది 15 వేల రూపాయలు జమ చేస్తున్నారన్నారు.

# అమ్మఒడి పేద విద్యార్థుల పాలిట వరం

- జిల్లాలోని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో అమ్మఒడి నగదు రూ.252.55 కోట్లు జమ
- సమాజంలో అసమానతలు పోవాలంటే విద్య ఒక్కటే మార్గం - కలెక్టర్ వెంకటరమణారెడ్డి



అమ్మఒడి కార్యక్రమంలో విద్యార్థులకు తల్లులకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, ఎంఎల్‌సిలు బల్లి కళ్యాణచక్రవర్తి, మేరిగ మురళి, కలెక్టర్

గూడూరు, జూన్ 28 ప్రభాతవార్త
పేదరికంతో ఏ ఒక్క పిల్లవాడు విద్యకు దూరమయ్యే పరిస్థితి రాకూడదన్న ప్రధాన ఉద్దేశంతో, పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రతి బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్న జగనన్న అమ్మఒడి పేద విద్యార్థుల పాలిట వరంగా మారిందని తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం నవరత్నాలలో భాగంగా జగనన్న అమ్మఒడి పథకం కింద వరుసగా నాలుగో ఏడాది 2023-23 విద్యా సంవత్సరానికి 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిబంధనల మేరకు నగదు జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే వరప్రసాద్, ఎంఎల్‌సిలు బల్లి కల్యాణచక్రవర్తి, మేరిగ మురళి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనక దేవసేనమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అమ్మఒడి కార్యక్రమంలో మన రాష్ట్రంలో తప్ప దేశంలో ఎకనకడా లేదని, రాష్ట్రప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న గొప్ప కానుక అని అన్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఇంగ్లీష్ మీడియం అమలు, డిజిటల్ విద్య అమలు, జగనన్న విదేశీ విద్య, వైఎస్సార్ సంపూర్ణ పోషణ తదితర వినూత్నమైన కార్యక్రమాలు అమలు చేసి విద్యకు పెద్దపీట వేసి ప్రోత్సహిస్తున్నారని అన్నారు. గతంలో తాను చదువుకున్న రోజులు గుర్తుకు వస్తున్నాయని, ఇప్పుడు ఉన్న వసతులు చూస్తే మళ్లీ పాఠశాలలో చేరి చదువుకోవాలని ఉందని తెలిపారు. గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు మాట్లాడుతూ సమాజంలో అసమానతలు పోవాలంటే విద్య ఒక్కటే మార్గమని నమ్మి విద్యకు పెద్దపీట వేసిన గొప్ప వ్యక్తి మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎంఎల్‌సిలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ చక్రవర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మలు మాట్లాడుతూ నేటి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తే వారు మంచి పౌరులుగా తయారవుతారని, వారే మన ఆస్తి అని నమ్మిన గొప్ప ముఖ్యమంత్రి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్, మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, డిప్యూటీ డిఇఓ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎంఇఓలు దేవరాజులురెడ్డి, కాంచన, హెచ్ఎం భారతి, విద్యార్థులు, తల్లులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### రామకుప్పం పోలీస్‌స్టేషన్ ఎదుట

## దేశం శ్రేణుల భారీ ధర్నా

### - ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ ..



పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన తెదేపా శ్రేణులు

కుప్పం(రామకుప్పం), జూన్ 28 ప్రభాతవార్త
దళిత సర్పంచ్‌భర్తను కోర్టు ఆవరణలో ఎన్‌కౌంటర్ చేస్తానని హెచ్చరించిన రామకుప్పం ఎసై ్స కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని చంద్రబాబు కార్యదర్శి మనోహర్, డా॥ సురేష్‌బాబు, రాజ్‌కుమార్, మునస్వామి డిమాండ్ చేశారు. బుధవారం కుప్పం నియోజకవర్గంలోని తెదేపా శ్రేణులు అధిక సంఖ్యలో రామకుప్పం పోలీస్‌స్టేషన్ ఎదుటకు చేరుకుని పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. రామకుప్పం ఎస్సై కృష్ణయ్య వైకాపా నాయకుడిగా ప్రవర్తించడం తెదేపా నేతలు, కార్యకర్తలను ఎన్‌కౌ ంటర్ చేస్తామని బెదిరించడం దారుణమన్నారు. కుప్పం నియోజకవర్గంలో తప్పుడు కేసులతో అధికార పార్టీ నేతలు పోలీసుల ద్వారా ప్రతిపక్షాలను భయపెట్టాలని చూస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత మాజీ సర్పంచ్ మహాదేవి జయశంకర్ దంపతులకు న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు గోపీనాథ్, ప్రేమ్‌కుమార్, డా॥ వెంకటేష్,కన్నన్, సత్యేంద్రశేఖర్, త్రిలోక్,శాంతారాం, ఆనందరెడ్డి, నరసింహులు, చిన్నికృష్ణ, పత్ర నారాయణ,బేటప్ప నాయుడు, విశ్వనాథనాయుడు, కామరాజనాయక్, రవినాయక్, గంట్లప్పగౌడు, మనోహర్, కృష్ణ నాయక్, జయశంకర్, అనసూయ, చంద్రకళ, పద్మ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### చక్కెర కర్మాగారం శాశ్వత మూసివేతపై

# రైతుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రేణిగుంట, జూన్ 28 ప్రభాతవార్త:
రాష్ట్రంలోనే ఒక వెలుగు వెలిగిన తిరుపతి జిల్లా గాజులమండ్యం శ్రీ వెంకటేశ్వర సహకార చక్కెర కర్మాగారం చరిత్ర పరిసమాప్తం కానున్నదని, తీపి పంచిన వారికి చేదు అనుభవం మిగిల్చారని, ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి జీవనోపాధి కల్పించిన కర్మాగారం శాశ్వతంగా రూపు మాసిపోతున్నదని టీడీపీ నేతలతో కలసి చెరకు రైతులు(సహకార సంఘంలోని సభ్యులు) బుధవారం కర్మాగారం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ముళ్ళ కంపలు, చెట్లను తొలగించాలని పిలిపించిన టెండర్లను వెంటనే వెనక్కి తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. లిక్విడేషన్ పేరుతో ఓ మంచి కర్మాగారాన్ని శాశ్వతంగా లేకుండా చేయడానికి తప్పు పట్టారు. కావాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదని తెలుగుదేశం నేతలు ఆరోపించారు. వెంటనే టెండర్లను వెనక్కి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చక్కెర కర్మాగారాన్ని టీటీడీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటన జరగకుండా రూరల్ సీఐ సుబ్బరాయుడు, గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి తమ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, టీడీపీ జిల్లా రైతు నాయకుడు మునస్వామినాయుడు, టీడీపీ సీనియర్ నేతలు పుష్పనాథం, కొరియర్ రవి, నెల్లూరు సుబ్రహ్మణ్యంలతో పాటు పలువురు రైతు నాయకులు సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆదేశాల మేరకే టెండర్లు పిలిచాం - లిక్విడేటర్ రవిబాబు

ప్రభుత్వ ఆదేశాలు మేరే టెండర్లు పిలిచామని లిక్విడేటర్ రవిబాబు తెలిపారు. తాము ఏ పార్టీకి చెందిన వారం కాదని ప్రభుత్వ ఆదేశాలను అమలు పరస్తున్నామన్నారు. ముళ్ళ కంపలు చెట్లను తొలగించే విషయంలో అటవీశాఖ అధికారులు, స్థల విషయంలో రెవెన్యూ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉత్తర్వులను అమలుపరస్తున్నామన్నారు.



లిక్విడేటర్ రవిబాబు, సీపీఐ నేత రామానాయుడు

### న లోపాయి కారి ఒప్పందం జరిగింది - రామానాయుడు

చక్కెర కర్మాగారం ప్రాంగణంలో 50 లక్షల విలువ చేసే చెట్ల విక్రయంలో లోపాయి కారి ఒప్పందం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఫ్యాక్టరీ సంరక్షణ కోసం నియమించిన 13 మంది తాత్కాలిక ఉద్యోగుల జీతాల కోసం వేలం ద్వారా వచ్చిన డబ్బును కేటాయించాల్సిందిగా రాష్ట్ర కేన్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. లిక్విడేటర్ ప్రక్రియలో పారదర్శకత ఉండాలన్నారు. తక్షణ ప్రభుత్వం రైతులను, ఉద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## విద్యకు అత్యధిక ప్రాధాన్యం

### జడ్పీ స్థాయి సంఘ సమావేశాల్లో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు, జూన్ 28 ప్రభాతవార్త:
దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో బుధవారం ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్లు భూమిరెడ్డి ధనంజయరెడ్డి, రమ్యలు, జడ్పీ మహిళా స్థాయి సంఘ ఛైర్మన్ భారతిల అధ్యక్షతన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి హాజరై సభ్యులు లేవనెత్తిన సమస్యలకు అధికారులతో సమాధానాలు ఇప్పించారు. జడ్పీ 1,7 స్థాయి సంఘ సమావేశాల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా గ్రామ, మండల, జిల్లా స్థాయిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌళిక సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు, ఎంఇఓ-2 పోస్టులను భర్తీ చేయడం, విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడానికి టెన్త్‌లో అత్యధిక మార్కులు



సాధించిన వారికి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా నగదు, మెరిటెట్ సర్టిఫికేట్లు, మెడల్స్ అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాల్లో డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, డ్వామా పిడి గంగాభవానీ, హౌసింగ్ పిడి పద్మనాభం, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, వయోజన విద్య డిడి నాగేశ్వర్‌రెడ్డి, డిఐసి జిఎం కృష్ణకిషోర్, పశుసంవర్ధకశాఖ జెడి ప్రభాకర్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఉద్యానశాఖ డిడి మధుసూధన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, జడ్పీటిసీలు, స్థాయి సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు గట్టుపై పురిటి బిడ్డ



బంగారుపాళ్యం, జూన్ 28 ప్రభాతవార్త:
అభం శుభం తెలియని పురిటి మగబిడ్డ చెరువు గట్టుపై ఏడుస్తున్న సంఘటన మండలంలోని బలిజపల్లి వద్ద చోటు చేసుకొంది. ఆ పురిటి బిడ్డ ఆ తల్లికి ఎంత భారమైందో... ఆ బిడ్డను చెరువు గడ్డపై పడవేసి వెళ్ళింది. గ్రామానికి చెందిన కొందరు అటుగా వెళ్తూ బిడ్డ అరుపులు విని వచ్చి చూశారు. అప్పటికే ఆ పురిటి బిడ్డను చీమలు చుట్టి వుండటంతో స్వల్పంగా గాయాలు అయినట్లు గుర్తించారు. గట్టుపై వున్న బిడ్డ సమాచారంను మహిళా పోలీసు సుజాతకు తెలియజేస్తే ఆమె 108 వాహనంకు సమాచారం అందించారు. 108 వాహనం చెరువు వద్దకు చేరుకొని పురిటి బిడ్డకు చికిత్స చేసి వెంటనే బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చీమలు బిడ్డను కుట్టడం వల్ల కొంత మేరకు గాయాలు పాలైనట్లు వైద్యాధికారిణి డాక్టర్ విజయకుమారి తగు చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కామాక్షిపురంకు చెందిన రామంజనేయులమ్మ ఈ బిడ్డను తనకు అప్పగిస్తే పెంచుకొంటానని తెలిపింది. అయితే అంగన్‌వాడీ టీచర్, హెల్పర్, ఇతర వైద్య సిబ్బంది చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి బిడ్డను తీసుకెళ్ళగా అదే వాహనంలో రామాంజనేయులమ్మ సైతం ఆసుపత్రికి వెళ్ళింది. విషయం తెలిసిన వెంటనే నాగరాజరావు, ఎఎస్ఐ మల్లప్పలు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు.

### శాంతియూత వాతావరణంలో

## బక్రీద్ పండుగను జరుపుకుందాం

### జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి



తిరుపతి క్రైం, జూన్ 28, ప్రభాతవార్త
త్యాగానికి ప్రతీకంగా భావించే బ్రకీద్ పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా గట్టి భద్రతా చర్యలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ముస్లీం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే బక్రీద్ పండుగ పర్వదినం సందర్భంగా అల్లా అనుగ్రహం ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని వారి జీవితం సుఖశాంతులతో ఆనందంగా గడపాలని ఆశిస్తున్నానని ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ, తొలి ఏకాదశి పండుగ పర్వదినాలను పురస్కరించుకుని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ తిరుపతి ఒక శాంతి నిలయం ఇక్కడ అన్నీ మతాలు ఒక్కటే ఒకరి మనోభావాలను ఒకరు గౌరవించుకుంటూ సంతోషంగా ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు. అందరూ ఐకమత్యంతో ఎటువంటి అవాంచనీయ సంఘటన లకు తావు ఇవ్వకుండా శాంతియుతంగా మిత్ర భావంతో ప్రేమను పంచుకుంటూ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## కన్నుల పండువగా వధూవరుల ఊరేగింపు



శ్రీకాళహస్తి,జూన్ 28 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ద్రౌపదీ సమేత అర్జునుడు వధూవరులుగా పట్టణంలో దర్శనమిచ్చారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద కన్నుల పండువగా అర్జునుడు ద్రౌపదీ వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఇ ఓ వికె సాగర్ బాబు ఆదేశాలతో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఉత్సవాల పర్యవేక్షకుడు లక్ష్మయ్య, దేవస్థానం అధికారులు, ఉద్యోగస్తులు హాజరయ్యారు. బుధవారం ఉదయం స్వామి అమ్మవార్లు సప్పర వాహనంలో దర్శనమిచ్చారు. స్వామిఅమ్మవార్లను సురేష్‌గురుకుల్, పరమేశ్వరస్వామిలు చక్కగా కళ్యాణ ముస్తాబుతోనే అర్జునసమేత ద్రౌపదీ అమ్మవారిని చక్కగా సప్పరంలో ప్రతిష్టించారు. ఆలయ సంప్రదాయంతో పూజారి దయానందం పురుషోత్తంలు స్వామి అమ్మవార్లకు హారతులిచ్చి ఊరేగింపును ప్రారంభించారు. మేళ తాళాలు పంబజోళ్ల మోతతో ఊరేగింపు జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి,నగరి వీధుల మీదుగా సాగింది.మధ్యాహ్నం ఆలయంలో రాజసూయయాగం ఘట్టాన్ని భారతంలో చదివి భక్తులకు వినిపించారు.రాత్రి రాజసూయ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయాధికారులు వెంకటస్వామి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మిదేవిల ప్రదర్శన దృశ్యం

## అమ్మఒడి ప్రచార ఆర్భాటం

– జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు

చిత్తూరు, జూన్ 28 ప్రభాతవార్త:



ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని చెప్పున్న అమ్మఒడి పథకం సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రచార ఆర్భాటం కోసమేనని జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు పేర్కొన్నారు. చిత్తూరులో బుధవారం జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు విలేకరులతో మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ మొదట ఒక కుటుంబంలో ఇద్దరికి అమ్మఒడి అమలు చేస్తామని చెప్పి ఆపై ఒకరికి మాత్రమే పరిమితం చేశారని ధ్వజమెత్తారు. అలాగే గతంలో కంటే బుధవారం విడుదల చేసిన అమ్మఒడి నిధుల్లో 1.34 లక్షల మంది విద్యార్థులకు నిధులు నిలిచిపోయాయని ఆరోపించారు. ఎపిలో విద్యాసంస్కరణలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పున్న ప్రభుత్వం ఒకసారి పాఠశాల విద్యాప్రమాణాలను ప్రపంచానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసనా స్థాయిలను పరిశీలిస్తే దేశంలోని అనేక రాష్ట్రాల కంటే మన రాష్ట్రం వెనుకబడి వుందన్నారు.

## ముగిసిన అర్జున తపస్సు

పాలసముద్రం, జూన్ 28 ప్రభాతవార్త:



పాలసముద్రం మండలం కృష్ణాజిమ్మా పురం పంచాయతీ కొండం గ్రామంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సును వైభవంగా నిర్వహించి ముగించారు. ఈ తపస్సు ఉత్సవంను వీక్షించడానికి పరిసర గ్రామస్తులు భారీగా హాజరు కాగా అర్జున వేషాధారి పాటలు పాడుతూ తపస్సు మాను ఎక్కి పై నుండి నిమ్మకాయలు, విభూది పండ్లు విసిరాడు. అర్జున తపస్సు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## దేశం కార్యాలయంలో థామస్ పుట్టిన రోజు వేడుకలు

పాలసముద్రం, జూన్ 28 ప్రభాతవార్త:



పాలసముద్రంలోని జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్ పుట్టిన రోజు వేడుకలను మాజీ జడ్పీటీసీ భీమినేని చిట్టిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు నిర్వహించి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్ ఆరోగ్యంగా వుండాలని భీమినేని చిట్టిబాబు ప్రార్థించారు. కార్యక్రమంలో మండల దేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, ఉపాధ్యక్షుడు రేణుగోపాల్, కోశాధికారి విజయ్‌కుమార్, ఎస్సీసెల్ అధ్యక్షుడు సాంబశివన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం శక్తి సంఘాలకు రూ. 234కోట్ల రుణాలు పంపిణీ

– ఇండియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు మహేష్‌కుమార్

చిత్తూరురూరల్, జూన్ 28 ప్రభాతవార్త:



ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లి గ్రామంలో సప్తగిరి గ్రామీణబ్యాంకు 236వ శాఖను ఇండియన బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు మహేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వున్న అన్ని గ్రామీణబబ్యాంకు కంటే సప్తగిరి గ్రామీణబ్యాంకు అభివృద్ధిపరంగా అగ్రస్థానంలో వుందన్నారు. సప్తగిరి గ్రామీణబ్యాంకు పూర్తి ప్రభుత్వరంగ బ్యాంకు అని, ఇండియన్‌బ్యాంక్‌తో ప్రయోజితం చేయబడిందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 537 కోట్ల లాభం ఆర్జించిందనీ, 22వేల కోట్ల రూపాయలకన్న ఎక్కువ వ్యాపారం చేసిందన్నారు. కృష్ణ, చిత్తూరు జిల్లాల ప్రజలు బ్యాంకును ఎంతో ఆదరిస్తున్నారని ఆనందం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణబ్యాంకు చైర్మెన్ ప్రసాద్, ఇండియన్‌బ్యాంకు ఎఫ్‌జిఎం గణేష్‌రామన్, జిఎం మణిసుబ్రమణ్యం, జనరల్‌మేనేజర్ ప్రభాహర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామక్రిష్ణ, విజయవాడజనరల్ మేనేజరు బ్రహ్మయ్య,

## ఆక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ సీజ్

పలమనేరు, జూన్ 28, ప్రభాతవార్త:



పట్టణంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను జిల్లా ప్రత్యేక బృందం అధికారులు సీజ్ చేసి బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టణంలో ఎదేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలిస్తు కొంత మంది లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సెబ్ బృందం పట్టణంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. కొంత మంది అధికార పార్టీ నాయకులు అధికార అండతో మండలం సమీపంలోని కౌండిన్య నది నుండి ఇసుక అక్రమంగా తరలిస్తు లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని పట్టణంలో వారి ఆధ్వర్యంలోనే అధికంగా ఇసుక తరలుతుందని విమర్శలు లేకపోలేదు. పట్టణంలో ట్రాక్టర్ ఇసుక సుమారు రూ.3 వేల నుండి రూ.4వేలకు విక్రయిస్తున్నారు. అయితే గంగవరం పత్తికొండ సమీపంలో ఇసుక రీచ్ ఉండగా అక్కడి నుండి ఇసుకను తరలించడం ఇంటి నిర్మాణ దారులకు ఇబ్బందిగా మారడంతో అక్కడి నుండి నామమాత్రంగా ఇసుక పట్టణానికి చేరుతుంది. ఇదే అవకాశంగా స్థానికంగా కొంత మంది అక్రమంగా సమీప కౌండిన్య నది నుండి ఇసుకను తరలిస్తు లక్షలను ఆర్జిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

## మున్సిపల్ కార్మికుల సమస్యలపై దశలవారీ పోరాటం

కుప్పం, జూన్ 28 ప్రభాతవార్త



రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలపై దశలవారీగా పోరాట ం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో పనిచేసే కార్మికులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. యూనియన్ అధ్యక్షుడు గోవిందరాజు, మంజుల, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

## గడపగడపకు ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం

–పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు

తవణంపల్లె, జూన్ 28 ప్రభాతవార్త:



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అన్నారు. బుధవారం నల్లిశెట్టి పల్లె గ్రామ సచివాలయ పరిధిలోని కొత్త గొల్లపల్లె, కొర్నం వాండ్ల మూరం, నల్లిశెట్టిపల్లె తదితర గ్రామాలలో ఎమ్మెల్యే బాబు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ త్యాగరాజులురెడ్డి, ఉపాధి ఏపీఓ లలిత, వెలుగు ఏపీఎం రవి, ఏఓ ప్రవీణ్, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ సిద్దపల్లె హరిరెడ్డి, నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, కామాలూరు శేఖర్‌రెడ్డి, జనార్ధన్ యాదవ్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరాధా రుక్మిణి సమేత శ్రీకృష్ణా ఆలయ కుంభాభిషేకం

పాలసముద్రం, జూన్ 28 ప్రభాతవార్త:

మండలంలోని శ్రీకావేరిరాజుపురం గ్రామంలో బుధవారం శ్రీ రాధా రుక్మిణి, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, వినాయక విగ్రహ ప్రతిష్టతో మహాకుంభాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కుంభాభిషేక కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ జడ్పీటిసీ భీమినేని చిట్టిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల దేశం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్, నాయకులు రవినాయుడు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వార్డులలో అభివృద్ధి ఏది..!

–ప్రజలు ఆడిగే ప్రశ్నలకు సమాదానం ఇవ్వలేకపోతున్నాం..

–మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ కిరణ్‌కుమార్

పలమనేరు, జూన్ 28, ప్రభాతవార్త:




వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టలేదని ప్రజలు ప్రశ్నిస్తుంటే సమాదానం ఇవ్వలేకపోతున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ కిరణ్‌కుమార్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులపై మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీక్రిష్ణ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం వైస్‌చైర్మన్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సుమారు 2నెలల క్రితం ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా 3వ వార్డులో రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించగా ఇప్పటి వరకు అధికారులు స్పందించలేదని ప్రజలు ఎమ్మెల్యే తెలిపినప్పటికీ ఎందుకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదని ప్రశ్నిస్తుంటే సమాదానం చెప్పలేని పరిస్థితులలో ఉన్నామని తెలిపారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమీషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు ఆమోదించామని త్వరలో నిర్మాణ పనులు చేపడుతామని తెలిపారు. 19వ వార్డు కౌన్సిలర్ హైదర్ మాట్లాడుతూ ఆర్టీసి బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లక్స్ నిర్మాణం అసంపూర్ణంగా ఉందని వర్షాలు పడితే దుకాణాలలో వర్షపునీరు చేరుతుందని, కాంట్రాక్టర్‌కు నోటీసులు అందించి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

***విష జ్వరాల నివారణకు చర్యలు తీసుకోండి:టిడిపి కౌన్సిలర్ శరధ***

పట్టణంలోని జి.కోటురులో విషజ్వరాలు అధికంగా ఉన్నాయని ఇప్పటికే పలు కుటుంబాలు విషజ్వరాల బారిన పడ్డారని తెలిపారు. ఇటీవల వర్షాలతో వార్డులలో పలు ప్రాంతాలలో వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో దోమల వృప్తి అధికంగా ఉందని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు వైద్య సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకుంటామని, నీటి నిల్వల తొలగింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం

చౌడేపల్లి, జూన్ 28 ప్రభాతవార్త



మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబు రమేష్ బదిలీ అయ్యారు. దీంతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో 8యేళ్ళపాటు పనిచేసిన ఆయన సేవలను పలువురు ఉపాధ్యాయులు, స్థానికులు కొనియాడారు. ఉపాధ్యాయులకు బదిలీలు సాధారణమనీ, ఉన్నంత కాలం అందరి మన్నలను పొందడం శుభపరిణామమన్నారు. ప్రధానోపాధ్యా యురాలు నీరజ, నాగమల్లిక, ఉపాధ్యాయులు అమృత, శివరాత్రి వీరభద్రయ్య, గ్రామస్తులు చెంగల్‌రెడ్డి, నారాయణరాజు, బాలకృష్ణంరాజు, యోగానంద, ఎస్టీయు అధ్యక్షుడు లింగమూర్తి, సుధాకర్‌నాయుడు, శంకర, మురళి, పురుషోత్తమ్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఘనంగా నియోజకవర్గ టిడిపి కన్వీనర్ థామస్ జన్మదిన వేడుకలు

గంగాధర నెల్లూరు జూన్ 28 ప్రభాతవార్త



మండల టిడిపి పార్టీ మండల అధ్యక్షుడు స్వామి దాస్ ఆధ్వర్యంలో నియోజక వర్గ కన్వీనర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా థామస్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బస్టాండు కూడలి వద్ద భారీ ర్యాలీ నిర్వహించి మండల కేంద్రంలోని అన్నా క్యాంటీన్ వద్ద బాణా సంచా పేల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పార్టీ నాయకులకు కార్యకర్తలకు పేదలకు బిరియానీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు నాయకుడు పిఎస్ మనోహర్ నాయుడు, కృష్ణమ నాయుడు, రఘునాధ నాయుడు, మునిరాజులు, పద కుమార్, వంకటేష్, ప్రకాష్ నాయుడు, దేవసుందరం, జగన్నాథ రెడ్డి, గోపి, మోహన్ నాయుడులతో పాటు పలువురు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వృద్ధుల కాలక్షేపం కోసం ఆశ్రమం ఏర్పాటు

– వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, జూన్ 28, ప్రభాతవార్త:



వృద్ధుల కాలక్షేపం కోసం ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం నాలుగో వార్డు కుమ్మర కుంట కాలనీలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలు లేకుండా ఉండే వృద్ధులు కాలక్షేపంగా ఉండేందుకు ఆశ్రమం ఏర్పాటు చేసి అక్కడ ఉండే విధంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఆయన నెరవేర్చినట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కరించకపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. స్థానికంగా ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట కౌన్సిలర్లు ఎం.ఎ.నారాయణ, జానకిరామయ్య, సుబ్బారావు, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, నాయకులు కోటేశ్వరరావు, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణదారులు కచ్చితంగా లైసెన్సులు కలిగిఉండాలి

– ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరి, జూన్ 28, ప్రభాతవార్త:



పురుగు మందులు, ఎరువుల దుకాణదారులు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలని ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. బుధవారం వెంకటగిరిలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారిణి సుజాతతో కలిసి తనిఖీ చేశారు. లైసెన్సు లేని ఎరువుల దుకాణదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణదారులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. పీసీలు కూడా ఉండాలని తెలిపారు. అధిక ధరలకుఎరువులువిక్రయిస్తేచర్యలు తీసుకుంటామన్నారు. ఆయన దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

– జూనియర్ సివిల్ జడ్జి

సూళ్లూరుపేట, జూన్ 28 ప్రభాతవార్త



విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని సూళ్లూరుపేట జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక తేజ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు చట్టాలలో సున్నితమైన అంశాల గురించి ఆయన వివరించారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, దానివల్ల బాలికలకు వచ్చే నష్టాల గురించి తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండకుండా ఎవరైనా బాలికలకు వివాహం చేస్తే ఆ సమాచారాన్ని స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. అదేవిధంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో అడిషనల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ ఎస్.అనూష, బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు ఎస్.శ్రీరాములుయాదవ్, పి.లక్ష్మయ్య, చక్రవర్తి, జి.క్రాంతికుమార్, ఎల్.చలపతి తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో లేబర్ అధికారుల దాడులు

సూళ్లూరుపేట, జూన్ 28 ప్రభాతవార్త



సూళ్లూరుపేట పట్టణంలో గూడూరు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం వివిధ వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహించారు. 14 సంవత్సరాలు నిండకుండా తమ సంస్థలలో పనులకు పెట్టుకొని ఉన్న పిల్లలను గుర్తించారు. పూల అంగళ్లు, చిల్లర వ్యాపార సంస్థలు, కూల్‌డ్రింక్‌షాపుల్లో పిల్లలు ఉండటాన్ని వారు గుర్తించి కేసులు నమోదు చేశారు. వీరికి కోర్టు ద్వారా నోటీసులు పంపి జరిమానా విధిస్తామని సురేష్‌బాబు తెలిపారు. ఈ దాడుల్లో దాదాపు నాలుగైదు అంగళ్లపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. పట్టణంలోని అంగళ్లపై లేబర్ కమిషనర్ అధికారులు దాడులు చేస్తున్నారన్న సమాచారంతో కొందరు వ్యాపారులు తమ అంగళ్లలోని పిల్లలను బయటకు పంపించి జాగ్రత్త పడ్డారు.

## యువగళం పాదయాత్ర ప్రభంజనం సృష్టించింది

నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, జూన్ 28 ప్రభాతవార్త



సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర ప్రభంజనం సృష్టించిందని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం నాయుడుపేటలోని తన నివాసంలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేఖరులతో మాట్లాడారు. పాదయాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, నియోజకవర్గంలో జరుగుతున్న లోటుపాట్లను ప్రజలకు లోకేష్ వివరించారని తెలిపారు. ఈ నేపథ్యంలో లోకేష్‌పై సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శలు చేయడం సరికాదన్నారు. మాజీమంత్రిపరసావెంకటరత్నం, శ్రీరాంప్రసాద్ తదితరులు ఉన్నారు.


## చెత్త సేకరణకు ఎలక్ట్రికల్ ఆటోలు ప్రారంభం

నాయుడుపేట, జూన్ 28 ప్రభాతవార్త

నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు సుమారు రూ.30 లక్షలతో నూతనంగా కొనుగోలు చేసిన ఎలక్ట్రికల్ ఆటోలను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపికలు ప్రారంభించారు. బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఎలక్ట్రికల్ ఆటోలను చెత్త తరలించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, కలికి మాధవరెడ్డి, మునస్వామినాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జయరామయ్య, పేట చంద్రారెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, నారాయణరెడ్డి, సరిత, బాబు, రాహుల్, మాజీ కోఆప్షన్ సభ్యురాలు నస్రిన్, భాస్కర్‌రెడ్డి, చదలవాడకుమార్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెంచయ్య పొదుపు గ్రూపుల వారు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ జగనన్న కాలనీలలో తాగునీటి వసతి కల్పనకు చర్యలు

నాయుడుపేట, జూన్ 28 ప్రభాతవార్త



నాయుడుపేట మండల పరిధిలోని బిరదవాడలో ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీలలో తాగునీటి వసతి కల్పించేందుకు ఇన్ ఫిల్టరేషన్ బావుల ఏర్పాటుకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శంకుస్థాపన చేశారు. ఏపీ టిడ్కో సంస్థ రూ.5 కోట్లతో ఇన్ ఫిల్టరేషన్ బావులను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని బిరదవాడ, మర్లపల్లి టిడ్కోఇళ్లు, జగనన్న కాలనీలకు అందించనున్నట్లు ఎమ్మెల్యే సంజీవయ్య తెలిపారు. స్వర్ణముఖి నదిలో సుమారు 40 అడుగులు లోతు బావిని తవ్వితే స్వచ్ఛమైన నీరు లభిస్తుందని నిపుణులు సూచించారని ఎమ్మెల్యే వివరించారు. స్వర్ణముఖి నదిలోని ఇన్ ఫిల్టరేషన్ బావి నిర్మాణ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, చదలవాడ కుమార్, మర్లపల్లి సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## తడలో యూటీఎఫ్ మెగా సభ్యత్వ నమోదు కార్యక్రమం

తడ, జూన్ 28 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా పరిధిలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మెగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం తడలో యూటిఎఫ్ మహిళా కన్వీనర్ కెఎంఎస్ సునీల ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటూ సభ్యత్వాలు నమోదు చేశారు. బుధవారం 110 మంది యుటిఎఫ్ సభ్యులుగా సభ్యత్వం తీసుకున్నారు. తడ మండల అధ్యక్షుడు కె.రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్.బాబు, సహ అధ్యక్షుడు కెపి నవీన్‌కుమార్, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

– ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు

గూడూరు, జూన్ 28 ప్రభాతవార్త



ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు శుభాకాంక్షలు తెలిపారు. దేవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈ పండుగ జరుపుకుంటారని, త్యాగనిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమన్నారు. బక్రీద్ పండుగ ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైనదని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. గూడూరు నియోజకవర్గం ముస్లిం సోదరులు, సోదరీమణులకు, అక్కచెల్లెమ్మలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

## మెడికవర్ ఆసుపత్రి సేవలు తడలో అందించడం ఎంతో సంతోషం

– సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ, జూన్ 28 ప్రభాతవార్త



మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవలు తడలో అందించడం ఎంతో సంతోషకరమని ఆసుపత్రి యాజమాన్యానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన తడలో మెడికవర్ ఆసుపత్రి శాఖను ప్రారంభించారు. ఇప్పటికే ఆంధ్రా, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో 28 శాఖలతో మెడికవర్ ఆసుపత్రి వైద్యసేవలు అందిస్తున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం ప్రజలకు ఈ ఆసుపత్రి వల్ల మేలు జరుగుతుందని, తీరప్రాంతాలకు రోగులు వెళ్లకుండా తడలోనే సూపర్ స్పెషాలిటీ సేవలను అందుకునే అవకాశం దక్కడం శుభపరిణామం అన్నారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అవసరమైతే నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు కూడా చేయడం అభినందించదగిన విషయమన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలంతా ఉపయోగించుకోవాలని కోరారు. మెడికవర్ హాస్పిటల్ నెల్లూరు సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ మాట్లాడుతూ తడ, శ్రీసిటీ, సూళ్లూరుపేట, శ్రీహరికోట తదితర ప్రాంతాల ప్రజలకు ఎల్లప్పుడూ వైద్యసేవలు అందుబాటులో ఉండేవిధంగా ఇక్కడ మెడికవర్ బ్రాంచిని ఏర్పాటు చేశామన్నారు. తమ ఆసుపత్రిలో రేయింబవళ్లు వైద్య సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు. జ్యోతి ప్రజ్వలనతో ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, కార్యక్రమంలో తడ మండలాధ్యక్షుడు కొళవి రఘురెడ్డి, తడ సర్పంచ్ కె.ఆర్ముగం, డిసిఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, వైసీపీ నాయకులు ఆర్‌కె సుందరం, శశికుమార్, జయకుమార్, మునుస్వామి, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ ఉదయభాస్కర్, నర్సింగ్ హెడ్ శైలజ, పిఆర్ఓ చందువర్మ, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లీం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ భాషా

ఓజిలి, జూన్ 28, ప్రభాతవార్త



ముస్లీం సోదరులకు, సోదరీమణులకు అక్క చెల్లెమ్మలకు, బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని మండల కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ భాషా పండుగు శుభాకాంక్షలు తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లీంలు ఈ పండుగ జరుపుకుంటారని, త్యాగనిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమన్నారు. బక్రీద్ పండుగ ముస్లీం సోదరులకు ఎంతో పవిత్రమైన పండుగ అని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో సిరి సంపదలతో తుల తూగాలని, సుహృద్భావ వాతావరణంలో పండుగను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. భక్తికి, త్యాగానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తున్న బక్రీద్ పండుగ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తున్నదన్నారు. ఓజిలి మండలం ముస్లీం సోదరులు, సోదరీమణులకు, అక్క చెల్లెమ్మలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయ స్థాయి మార్షల్ ఆర్స్ పోటీలలో రాణించిన విద్యార్థినిలు

తిరుపతి (విద్య), జూన్ 28, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు టి. ఆరతి గోల్డ్ మెడల్ (సిఇసి), కె. నిహారిక సిల్వర్ మెడల్ (సిఇసి), జి. నందిని సిల్వర్ మెడల్ (ఎంపిసి) సాధించారు. వీరంతా జూన్ 2023, 23వ తేది నుండి 25వ తేది వరకు తిరుపతిలోని ఆంధ్రప్రదేశ్ తాంగల్ మూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 12వ జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల మార్షల్ ఆర్స్ చాంపియన్‌షిప్ పోటీలలో తమ ప్రతిభ కనపరిచి మూడు మెడల్స్‌ని సాధించారు. వీరందరినీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. భువనేశ్వరి అభినందించి, నిరంతరం ప్రయత్నం ఉంటే నిరాశకే నిరాశపుడుతుందని, బ్రతుకుంటే నిత్య ఘర్షణని, చదువుతో పాటు ఇదే పోరాట పటిమతో మరెన్నో క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని, టిటిడి విద్యా సంస్థలకు కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రోత్సహించి, వీరికి సర్టిఫికేట్స్ మెడల్స్‌ని అందించి, వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని అభినందించారు. గెలుపొందిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులంతా అభినందించి మిగతా విద్యార్థినిలంతా ఇదే క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని కోరారు.

